సాక్షి
తిరుపతి
శుక్రవారం । 31 । మే । 2024



'వీఆర్'కు పంపిన కారు..!
చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. - 8లో



శ్రీవారి సేవలో ప్రముఖులు
తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో



గురుదక్షిణామూర్తికి పూజలు
శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం పద్మావతి మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఎన్నికల అధికారి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కొనసాగుతోందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రాలలో కావలసిన సామాగ్రి, భద్రత, సీటింగ్, బారీ కేడింగ్, మెష్, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అనంతరం సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ధ్యాన్ చంద్, అతిథీ సింగ్, డీఆర్‌ఓ పెంచల కిషోర్, అదనపు ఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు, జయరాజ్ పాల్గొన్నారు.

ఎస్వీయూ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ టోర్నీలో పాల్గొనేందుకు ఎస్వీయూ బాల్ బ్యాడ్మింటన్ జట్టును గురువారం ఎంపిక చేసినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ చెన్నై జేపియార్ వర్సిటీలో శుక్రవారం నుంచి టోర్నమెంట్‌లో జరుగుతుందని వెల్లడించారు. ఎస్వీయూ జట్టులో పీలేరు సీఎస్ఆర్, శ్రీ భారతి డిగ్రీ కళాశాలల నుంచి విష్ణువర్ధన్, ప్రదీప్ కుమార్, తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి సాయికిరణ్, వినోద్, వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి కిరణ్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ నుంచి సూర్య, యశ్వంత్, వెంకటేశ్వర్లు, పవన్ కుమార్ ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్వీయూ ఇంజినీర్ తాండవ కృష్ణ, మేనేజర్ కుమార్, కోచ్ డి.జయచంద్ర పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ



ప్రవీణ్‌కుమార్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : సామాజిక పింఛన్లను జూన్ 1వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,69,684 మందికి లబ్ధిదారులకు రూ.80.25 కోట్లు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బ్యాంక్ ఖాతాలు ఉన్నవారికి వారి అకౌంట్‌లో ఫించన్ మొత్తం జమ చేయనున్నట్లు చెప్పారు. ఖాతాలు లేని వారికి, 80ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటివద్దకే సచివాలయ సిబ్బంది వచ్చి పింఛన్ నగదు అందించనున్నట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 1,95,865 లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లు ఆధార్ నంబర్‌తో లింక్ అయి ఉన్నాయని, వీరికి డీబీటీ ద్వారా 1వ తేదీన పెన్షన్ నగదు జమ చేస్తామన్నారు. మిగిలిన 73,819 మంది ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయ ఉద్యోగులు నగదు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు పింఛన్ నగదు విత్ డ్రా చేసుకునేందుకు అన్ని బ్యాంక్‌ల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. లబ్ధిదారులందరికీ పింఛన్ నగదు అందుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

మడ.. ఏదీ మనుగడ?

సాగర తీరం పరిరక్షణలో మడ అడవులు కీలక పాత్ర పోషిస్తాయి.. మత్స్య సంపద అభివృద్ధికి దోహదపడతాయి.. ప్రకృతి వైపరీత్యాల నుంచి కాపాడేందుకు పెట్టని గోడలా నిలుస్తాయి.. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా కిలోమీటర్ల మేరకు చెట్లు నరికివేతకు గురవుతున్నాయి.. అవగాహలోపంతో మత్స్యకారుల ఇళ్లలోనే వంట చెరుకుగా మారిపోతున్నాయి.. పలు ప్రాంతాల్లో వేలాది హెక్టార్లు రొయ్యల గుంతలుగా మారిపోతున్నాయి.. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మడ చెట్ల పెంపకానికి శ్రీకారం చుట్టింది. గత మూడేళ్లుగా ఎక్కడికక్కడ విత్తనాలు నాటిస్తోంది. అటవీ విస్తీర్ణం పెంచేందుకు ముమ్మరంగా కృషి చేస్తోంది.



ఏపుగా పెరిగిన మడ చెట్లు

- రోజు రోజుకూ తగ్గుతున్న మడ అడవుల విస్తీర్ణం
- యథేచ్ఛగా నరికేస్తున్నా పట్టించుకోని అధికార యంత్రాంగం
- మత్స్య సంపద అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావం
- విపత్తుల తీవ్రత తగ్గించడంలో మడ చెట్లు కీలకం
- దిద్దుబాటు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- తీర ప్రాంతాల్లో మొక్కల పెంపకానికి శ్రీకారం



కొండూరుపాళెం వద్ద మడ అటవీ విస్తీర్ణం తెలిపే వివరాల బోర్డు

వాకాడు : సముద్ర తీర జీవ వైవిధ్యంలో మడ అడవులు ప్రధాన భూమిక పోషిస్తాయి. అలాగే ప్రతికూల వాతావరణం నుంచి మనుషులు, వన్యప్రాణులను మడ చెట్లు కాపాడుతాయి. సముద్రం ద్వారా ఏర్పడే విపత్తులను దీటుగా ఎదుర్కొని, తీరం కోతకు గురికాకుండా కరకట్టలా ఉపకరిస్తాయి. అదే క్రమంలోనే వలస చేపలు, రొయ్యలకు షెల్టర్ ఇస్తాయి. వాటి ప్రత్యుత్పత్తి కేంద్రాలుగానూ నిలుస్తాయి. మత్స్య సంపదను పెంపొందించడంలో మడ అడవులు కీలకంగా ఉంటాయి. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో సుమారు 169 కిలోమీటర్లు పొడవునా సముద్ర తీరం వ్యాపించి ఉంది. అందులో 12 తీర ప్రాంత మండలాలు, 158 గ్రామాలు ఉన్నాయి. అదే క్రమంలో 68 చదరపు కిలోమీటర్లు పొడవున మడ అడవులు విస్తరించి ఉన్నాయి. వన్యప్రాణుల సంరక్షణ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో గత రెండున్నర దశాబ్దాల కాలంలో కాలక్రమేణా మడ చెట్లు 35 చదరపు కిలో మీటర్లు పొడవున అంతరించిపోయాయి., అప్పటి నుంచీ ఆయా ప్రాంతాల్లో సముద్ర తీరం కోతకు గురైంది, గతంతో పోల్చితే మత్స్య సంపద కూడా తరిగిపోయింది. పర్యావరణ పరిరక్షణతోపాటు, మత్స్య సంపదను పెంపొందించడంలో కీలక భూమిక పోషిస్తున్న మడ అడవులు కుంచించుకుపోయాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మడ అడవుల పెంపకంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ప్రతిష్టాత్మకంగా సముద్రతీరం వెంబడి కొత్తగా మడచెట్ల పెంపకం చేపట్టింది.

వైపరీత్యాలను అడ్డుకోవడంలో..

మడ చెట్లతో తీర ప్రాంత గ్రామాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. తుపాను, సునామీ వంటి విపత్తుల తీవ్రతను తగ్గించడంలోను మడ అడవుల పాత్ర ఎంతో కీలకం. ప్రజలకు మేలు చేసే మడచెట్లును, అవగాహనా రాహిత్యంతో కొందరు తీర ప్రాంతాలకు చెందినవారే నరికి వంట చెరుకుగా వాడుకుంటున్నారు. సముద్ర తీరప్రాంతం కోతకు గురి కాకుండా చూడడంతోపాటు ఎంతో ఉపయోగకరమైన మడ చెట్ల పరిరక్షణపై తీరప్రాంత గ్రామాల్లో అవగాహన కల్పించాల్సి ఉంది.



తూపిలిపాళెం వద్ద కోతకు గురైన సముద్రం తీరం (ఫైల్)

రొయ్యల గుంతలుగా మార్చేస్తున్నారు

కావలి, అల్లూరు, విడవలూరు, ముత్తుకూరు, చిల్లకూరు, వాకాడు, కోట, తడ, సూళ్లూరుపేట మండలాల పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ శాఖ ఆధీనంలోని మడ అడవులు చాలా వరకు కనుమరుగవుతున్నాయి. తీర ప్రాంత గ్రామాల్లోని మడ చెట్లను కొందరు నరికి వేసి రొయ్యల గుంతలుగా మార్చేస్తున్నారు. యథేచ్ఛగా చెట్లను తొలగిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాకాడు మండలంలోని తూపిలిపాళెం, కొండూరుపాళెం, శ్రీనివాసపురం, పంబలి, ఓడపాళెం, మొనపాళెం, చినతోట, పూడిరాయిదొరువు గ్రామాల వద్ద మడ చెట్లు చాలా వరకు అంతరించి పోయాయి. ఈ క్రమంలోనే తూపిలిపాళెం



కొండూరుపాళెం వద్ద అంతరించిపోతున్న మడ అడవి

పారెస్టు అధికారులు ప్రకృతి విపత్తులను తట్టుకొనే విధంగా దాదాపు 3 కిలోమీటర్ల పొడవునా తీరంలో తాటిచెట్లను నాటించారు. ఐతే వాటిని కూడా కొందరు ఆక్రమణదారులు తొలగించేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించకపోతే తీర ప్రాంత మనుగడకే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. మడ చెట్లను అంటిపెట్టుకుని ఉండే ఫైటోప్లాంటన్, జూ ప్లాంటన్ జాతులు చేపలు, రొయ్యలకు మంచి ఆహారంగా ఉపయోగపడతాయి. మడ అడవులను కాపాడుకుంటే మత్స్య సంపద సైతం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని వెల్లడిస్తున్నారు.

మరింత విస్తీర్ణంలో పెంపకం



సముద్ర తీరంలో మడ చెట్లు పెంచడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. అందుకే తీరంలో పలు చోట్ల అంతరించిపోతున్న మడ అడవులను మరింత విస్తీర్ణంలో పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం విత్తనాలను కూడా పంపిణీ చేసింది. వాటిని గత మూడేళ్లుగా సముద్ర తీరంలో చల్లిస్తున్నాం. మడ చెట్ల పెంపకంపై ప్రత్యేక దృషి సారించాం. ఎవరైనా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గాయం శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్, కొత్తపట్నం

చేపల సంతానోత్పత్తి పెరుగుతుంది



మడ చెట్లు ఏపుగా పెరగడం వల్ల సముద్రం కోతకు గురి కాకుండా గ్రామాలకు రక్షణ ఉంటుంది. అలాగే చేపల సంతానోత్పత్తికి బాగా ఉపయోగపతుంది. సముద్రం ఆటు పోట్ల సమయంలో నీరు మడ చెట్ల మధ్యకు రావడంతో చేపలకు మేత విరివిగా దొరుకుతుంది. అయితే కొన్నేళ్లుగా కొందరు తీర ప్రాంతవాసుల అవగాహన లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మడ చెట్లు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం మడచె ట్ల పెంపకంపై దృష్టి పెట్టడం సంతోషంగా ఉంది.

– సోమయ్య, మత్స్యకారుడు, తూపిలిపాళెం

మూడేళ్ల నుంచి చల్లుతున్నారు



మానవాళికి ఎంతో ఉపయోగకరమైన మడ చెట్లను అధికారులు గాలికి వదిలేయడంతో రెండు దశాబ్దాలుగా అంతరించిపోతూ వస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మడ చెట్ల పెంపకంపై చర్యలు తీసుకోవడంతో ఫారెస్టు అధికారులు గత మూడేళ్లుగా పెరుగుతున్న పెద్ద పెద్ద మడ చెట్లు నుంచి గింజలు సేకరించి వర్షాకాలంలో సముద్ర తీరంలో చల్లుతున్నారు. ఇప్పటికైనా మేలుకోవడం మంచిదే. ఇదే విధంగా కొన్నేళ్లపాటు మడ అడవుల అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– మహేంద్ర, దుగరాజపట్నం

వేటకు విరామం..
ఆగిన 'భరోసా'

- జిల్లాలో 3,786 మంది లబ్ధిదారులు
- కౌంటింగ్ తర్వాతే మత్స్యకారులకు చెల్లింపులు



చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ తీరంలో మత్స్యకారుల బోట్లు

తిరుపతి అర్బన్ : వేట విరామ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం జీవనభృతి అందిస్తోంది. మత్స్యకార భరోసా పథకం కింద ఏటా రూ.10వేల చొప్పున పంపిణీ చేస్తోంది. బోటు ఉన్న వారికి 300 లీటర్ల డీజిల్‌కు గాను ఒక్కో లీటర్‌కు రూ.9 చొప్పున రాయితీ ఇస్తోంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటను నిషేధించింది. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మత్స్యకారులకు భరోసా నగదు జమ చేసేందుకు అవరోధం ఏర్పడింది. దీంతో జిల్లాలోని సుమారు 3,786 మంది లబ్ధిదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పొట్ట పోషణ కష్టమైందని ఆవేదన చెందుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వేట విరామానికిక కేవలం రూ.4వేలు మాత్రమే చెల్లించే వారని గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా ఏటా రూ.10వేలు అందించేవారని, వివిధ సంక్షేమ పథకాలతో మత్స్యకారుల అభ్యున్నతికి సహకరించే వారని కొనియాడుతున్నారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ను కారణంగా చూపి తమలాంటి బడుగు జీవుల నోటికాడ ముద్దను అడ్డుకోవడం సరికాదని మండిపడుతున్నారు.

నిమ్మళంగా సాగు!

- యాజమాన్యంతో అధిక దిగుబడి
- అంతర పంటలతో లాభాలు



సైదాపురం మండలంలో సాగులో ఉన్న నిమ్మతోట

సైదాపురం : వెంకటగిరి, సైదాపురం, కలువాయి, డక్కిలి, బాలాయపల్లె, మండలాల్లో అత్యధికంగా నిమ్మ తోటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా నిమ్మ సాగు చేసే ముందు ఉద్యానశాఖాధికారులను సంప్రదించి, వారి సలహాలను పాటిస్తే మరింత లాభాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయని రైతులు వెల్లడిస్తున్నారు. దీనిపై పొదలకూరు ఉద్యానశాఖాధికారి ఆనంద్ మాట్లాడుతూ కొత్తగా నిమ్మ సాగు చేపట్టేవారు జూలై నుంచి ఫిబ్రవరి వరకు మొక్కలను నాటుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా యజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. దీంతో నాణ్యమైన దిగుబడి వస్తుందని వెల్లడించారు. ఈ మేరకు ఆయన మాటల్లోనే..

- నిమ్మ దీర్ఘకాలిక పంట కాబట్టి మొక్కలను తగు జాగ్రత్తతో ఎంపిక చేసుకోవాలి.
- కొమ్మ మీద గజ్జి తెగుళ్లు లేకుండా కనీసం 2.3 కొమ్మలతో వీలైనంత తక్కువ ముళ్లు కలిగి ఇగురుమీద లేని వాటిని తీసుకోవాలి.
- నిమ్మలో అంట్లు కంటే మొక్కలే మేలు.కొత్తగా మొక్కలు వేసుకునే రైతులు పెట్లూరు సెలెక్షన్-1, బాలాజీ రకాలు వేసుకుంటే మంచిది.
- ముందుగా పొలాలం దుక్కి దున్నుకోవాలి. మొక్కలను 6-7 మీటర్లు దూరంలో నాటుకోవాలి.
- నేల స్వభావాన్ని బట్టి తగు పరిమాణంలో గుంతలను ముందుగానే తవ్వి ఆరబెట్టుకావాలి.
- 30కిలోల పశువులను ఎరువు, కిలో సూపర్‌ఫాస్ఫేట్, 100గ్రాముల పాలిడాల్‌ను మంచి మట్టిలో కలిపి గుంతల్లో నింపాలి.
- గుంత మధ్యలో మొలక ఉండేటట్లు నాటి గాలికి వరగకుండా అధారం కల్పించాలి.
- మొక్క బతికే వరకు నీటిని తప్పకుడా పోస్తుండాలి.
- వేమ్ ట్రికోడెర్మాను గుంతల్లో వేసుకుని మొలకలు నాటుకుంటే ఇంకా మంచిది.
- మొక్క నాటిన మూడేళ్ల తర్వాత వరసల మధ్య ఖాళీస్థలంలో అంతర పంటలు వేసుకపోవచ్చు.
- ముఖ్యమంగా వేరుశనగ, పెసర, మినుము, గోరుచిక్కుడు, పుచ్చ, దోస, బంతి పంటలు సాగు చేసుకోవడం లాభదాయకం.
- వంగ, బెండ, మిరప, టమాట పంటలను ఎట్టి పరిస్థితుల్లో వేయకూడదు.
- లేత నిమ్మ తోటల్లో పచ్చి రొట్ట ఎరువులైన జీలుగ, జలుము, పిల్లిపెసర వంటివి చల్లి 50 శాతం పూత దశలో ఆకును కోసి నిమ్మ చెట్టు పాదులకు వేసుకోవాలి.
- భూసారం, నేల స్వభావం మేరకు నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వాడుకోవాలి.

'పది' మూల్యాంకనంలో తప్పిదం

గూడూరు రూరల్ : ఇటీవల నిర్వహించిన పదో తరగతి మూల్యాంకనంలో ఓ తప్పిదం జరిగింది. గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పరిమళ లక్ష్మీ బాలాజీ, శశికళ కుమారుడు కుషల్ శ్రీనివాస్ అనే విద్యార్థి పదోతరగతి పరీక్షలు రాశాడు. ఆ విద్యార్థికి అన్ని సబ్జెక్టులలో 90 పైగా మార్కులు రాగా, హిందీలో మాత్రం 17 మార్కులు మాత్రమే వచ్చాయి. దీంతో సదరు విద్యార్థి ఫెయిల్ అయ్యాడు. తల్లిదండ్రుల సూచన మేరకు రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేశాడు. ఇటీవల రీ వెరిఫికేషన్ ఫలితాలు వచ్చాయి. ఇందులో కుషల్ శ్రీనివాస్‌కు అదే హిందీ సబ్జెక్టులో 75 మార్కులు వచ్చాయి. మూల్యాంకన సమయంలో అధికారులు, సంబంధిత టీచర్ చేసిన తప్పిదం వల్ల కుషల్ శ్రీనివాస్‌కు అన్యాయం జరిగింది. ఇలాంటి తప్పుల వల్ల విద్యార్థుల జీవితాలు బలవుతాయని, మూల్యాంకనం చేసేప్పుడు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులు సూచిస్తున్నారు.

కౌంటింగ్‌కు భద్రత కట్టుదిట్టం



కాన్ఫరెన్స్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్ : కౌంటింగ్ ప్రక్రియకు కట్టుదిట్టంగా భద్రత కల్పిస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. గురువారం విజయవాడ నుంచి డీజీపీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు తిరుపతి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ రోజు, తర్వాత జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే 135 సమస్యాత్మక ప్రాంతాలలో అత్యంత పకడ్బందీ బందోబస్తు పెట్టినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే ట్రబుల్ మాంగర్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సహాయంగా 250 మంది పోలీసులతో అత్యవసర విభాగం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడ ఏం జరిగినా నిమిషాల్లో చేరుకునేలా భద్రత చర్యలు చేపట్టామని వివరించారు. కౌంటింగ్ ప్రక్రియకు ఎవరైనా ఆటంకం కలిగించాలని ప్రయత్నిస్తే ఉపేక్షించమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రమైన పద్మావతి మహిళ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలకు రెండు కిలోమీటర్ల పరిధిని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించామని తెలిపారు.

క్లుప్తంగా

కేంద్రమంత్రి అమిత్‌షాకు ఘన స్వాగతం



విమానాశ్రయం నుంచి కారులో బయటకు వస్తున్న కేంద్రమంత్రి అమిత్‌షా

రేణిగుంట : తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు గురువారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సాయంత్రం 6.05 గంటలకు కుటుంబ సమేతంగా చేరుకున్న ఆయన 6.12 గంటలకు వీఐపీ గేటు ద్వారా ప్రత్యేక కాన్వాయ్‌లో తిరుమలకు రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో అమిత్‌షాకు బీజేపీ నేతలు కోలా ఆనంద్, వాకాటి నారాయణరెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. స్వామివారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీఆర్‌కు పంపిన కారు..!

- అధికారిక వాహనం దుర్వినియోగంపై చర్యలు
- చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్ బదిలీ

తిరుపతి రూరల్ : చంద్రగిరి డీఎస్పీగా శరత్‌రాజ్‌కుమార్ మూడు నెలల క్రితం గోదావరి జిల్లాల నుంచి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపించారనే విమర్శలు ఉన్నాయి. ఆయన అలసత్వం వల్లే రామిరెడ్డిపల్లె, కూచువారిపల్లె, బ్రాహ్మణకాలువ గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు ఆయన గన్‌మెన్, డ్రైవర్, అనుచరులపై దాడులు చేసి, కార్లను కాల్చివేసినా ఆయన నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిని పెట్రోలు పోసి తగలబెట్టినా చూసీ చూడనట్టు వ్యవహరించారు. అప్పుడే డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని అందరూ భావించారు. అయితే పోలీసు అధికారులు మాత్రం ఆవైపుగా దృష్టి సారించలేదు.

పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో ఘర్షణలు జరుగుతున్నా.. గ్రామాలకు గ్రామాలే అల్లర్లతో అట్టుడికిపోతున్నా.. ఆ అధికారి వైఖరిని ఎవరూ పట్టించుకోలేదు. డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను గాలికి వదిలేసినా ఆయనపై చర్యలు తీసుకునేందుకు పోలీసు ఉన్నతాధికారులు వెనకడుగు వేశారు. తనను ఎవరూ ఏమి చేయలేరనే నిర్లక్ష్యం, నిలువెల్లా అహంకారంతో విర్రవీగిన ఆ అధికారి గర్వాన్ని ఓ కారు అణచి వేసింది. అసలు సంగతి ఏంటంటే.. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కేటాయించి కారును దుర్వినియోగం చేసినందుకు చంద్రగిరి డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్‌పై వేటు పడింది. ఆయనను వీఆర్‌కు బదిలీ చేస్తూ డీజీపీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



శరత్‌రాజ్‌కుమార్ (ఫైల్)

ప్రైవేటు వ్యక్తికి అప్పగింత

చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌కు పోలీసు శాఖ కారును కేటాయించింది. పద్మావతి వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఆయన తన కారును తాజ్ హోటల్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల యాజమాని వ్యక్తిగత అవసరాల కోసం పంపించారు. ఆయన దానిని పలు రకాలుగా ఉపయోగించుకుని బుధవారం సాయంత్రం కారుతో సహా వర్సిటీ స్ట్రాంగ్ రూమ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. డీఎస్పీ స్ట్రాంగ్ రూమ్ వద్ద విధుల్లో ఉంటే కారులో వస్తున్న వ్యక్తి ఎవరూ అంటూ గేటు వద్ద పోలీసులు ప్రశ్నించారు. తాను డీఎస్పీకి చాలా దగ్గరని, స్ట్రాంగ్ రూమ్ వద్దకు వెళ్లాలని సదరు కారులో ఉన్న ప్రైవేటు వ్యక్తి దబాయించాడు. పోలీసులను బెదిరించి కారును స్ట్రాంగ్ రూమ్ వైపు తీసుకెళ్లాడు. దీనిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వెంటనే ఎస్పీకి సమాచారం అందించారు. సీసీ కెమెరాల ఫుటేజీ, స్ట్రాంగ్ రూం వద్ద ప్రైవేటు వ్యక్తి సంచారాన్ని ఎస్పీ గుర్తించారు. డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీకి రిపోర్ట్ పంపారు. వెంటనే డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని, వీఆర్‌కు పంపించాలని డీజీపీ ఆదేశించారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వెళ్లి డీఎస్పీకి ఉత్తర్వులు అందించారు. నడిరోడ్డుపైనే ఆయన నుంచి అధికారిక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా రవికుమార్

క్రైమ్ డీఎస్పీ రవికుమార్‌ను చంద్రగిరికి ఇన్‌చార్జిగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల పరిధిలో అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారు. కౌంటింగ్ ముందు, కౌంటింగ్ రోజు, తర్వాత రోజు తీసుకోవాల్సిన భద్రత చర్యలపై సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో సమీక్షించారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,659
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.95,500
రిటైల్ వెండి గ్రాము	రూ.97.50

ఇంటర్ పరీక్షలకు 1,115 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలో గురువారం నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు మొత్తం 1,115 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 10,940 మందికి గాను 9,996మంది హాజరైనట్లు వెల్లడించారు. 944మంది గైర్హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 1,830 మందికి 1,659మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 171 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. శుక్రవారం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ (బీపీసీ విద్యార్థులు) సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నిబంధనల సరళీకరణపై సదస్సు





హెచ్‌ఆర్ మేనేజర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏపీ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఏపీ ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ బీ కింద నిబంధనల సరళీకరణపై శ్రీసిటీలో గురువారం సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ అధ్యక్షతన సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్లతో చేపట్టిన చర్చలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.చంద్రశేఖర్ వర్మ మాట్లాడుతూ 2016లో ఏపీ ఫ్యాక్టరీల చట్టం నిబంధనలోని సెక్షన్ 106 బీ కింద మొదటిసారిగా నేరాలను ప్రాసిక్యూషన్‌కి బదులు జరిమానా విధించే వెసులుబాటు కల్పించారన్నారు. మరి కొన్ని సవరణలు చేపట్టడం పరిశ్రమల భద్రతా వ్యవస్థలో పెను మార్పులు తీసుకువస్తాయని వెల్లడించారు. సవరణల వలన కలిగే ప్రయోజనాలు, లోపాలు, కార్మికుల భద్రతా అంశాలపై చర్చలకు ఆహ్వానించారు.
ప్రాసిక్యూషన్‌కు బదులుగా జరిమానా చెల్లించడం ద్వారా ఇటు కార్మికులు, యాజమాన్యాలకు, ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఫ్యాక్టరీ యజమానులు సుదీర్ఘమైన చట్టపరమైన ప్రక్రియను ఎదుర్కోకుండా, తొలిసారిగా జరిగిన అతిక్రమణ పునరావృతం కాకుండా సరిదిద్దడానికి అధీకృత అధికారి సమ్మేళనం చేయవచ్చని సూచించారు. ఈ సంస్కరణల ద్వారా చట్టపరమైన వివాదాల సంఖ్యను తగ్గించడం, ఆర్థిక జరిమానాలు విధించడాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వర్మ తెలిపారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాలను సరళీకృతం చేయడం, క్రమబద్ధీకరించడం లక్ష్యంగా ఈ సంస్కరణలు కొత్త అభివృద్ధి శకానికి దారితీస్తాయని తాను విశ్వసిస్తున్నానని వెల్లడించారు.

ఉపాధి కల్పనే లక్ష్యంగా కోర్సుల రూపకల్పన



మాట్లాడుతున్న కమిషనర్ పోలా భాస్కర్

తిరుపతి సిటీ : డిగ్రీ కళాశాలల్లో ఉపాధి కల్పనే లక్ష్యంగా కోర్సులను రూపకల్పన చేయాలని రాష్ట్ర కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. కోర్సుల రూపకల్పన, సింగిల్ మేజర్ ప్రోగ్రామ్, ఉపాధి కల్పన కోర్సులపై దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరంలో అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. ప్రాధాన్యత లేని కోర్సుల స్థానంలో కొత్త కోర్సులకు రూపకల్పన చేయాలన్నారు. విద్యార్థికి డిగ్రీ దశ కీలకమని, ఉపాధి, ఉద్యోగం పొందే విధంగా కోర్సులను రూపొందించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి కోర్సులోనూ నాణ్యమైన బోధనతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్థానిక అవసరాలు, మార్కెట్ ట్రెండ్, అగ్రికల్చర్, పారిశ్రామిక రంగంలో డిమాండు ఆధారంగా యువతను ప్రోత్సహించేందుకు నూతన కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. అనంతరం కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న కోర్సులు, విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులపై ఆరా తీశారు. శుక్రవారం ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ల తో సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులు, టీటీడీ డీఈవో ఎం భాస్కర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లా ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 73,811 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,901 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.19 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

2న క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి రూరల్ : 2024–25 క్రికెట్ సీజన్‌కు గాను జూన్ 2న ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్–16(బాలురు), అండర్–23 (పురుషులు) క్రికెట్ జట్లను ఎంపిక చేయనున్నట్టు జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని వైఎస్సార్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్–23 విభాగానికి 2001 సెప్టెంబర్ 1 నుంచి 2008 ఆగస్టు 31లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అండర్–16 విభాగానికి 2008 సెప్టెంబర్ 1 నుంచి 2010 ఆగస్టు 31 లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. అండర్–16 క్రీడాకారులు ఉదయం 8 గంటలకు, అండర్–23 క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు క్రీడా మైదానం చేరుకోవాలని వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రీడా సామగ్రితోపాటు ఆధార్ కార్డు, ఫాం–5 పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 9849026131, 7981880381లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రేపు ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ క్యాంపస్ పాఠశాల క్రీడా మైదానంలో శనివారం జూనియర్ బాలబాలికల ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సుధాకర్, ఎ.రెడ్డప్ప ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీలకు 2009–2019 మధ్య జన్మించిన బాలురు, 2008–2010 మధ్య జన్మించిన బాలికలు అర్హులని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఆసక్తి ఉన్న వారు బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో పోటీలకు హాజరుకావాలని కోరారు.

జూన్ 3న కౌన్సెలింగ్ 6వ తేదీకి వాయిదా

– కౌన్సెలింగ్‌కు 185 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 27వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన (కౌన్సెలింగ్) కొనసాగనుంది. చివరి రోజైన జూన్ 3వ తేదీ నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను 6వ తేదీకి వాయిదా వేస్తూ రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్ నాగరాణి ఉత్తర్వులు జారీ చేసినట్లు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు ఆప్షన్స్ ప్రక్రియ, 11వ తేదీ ఆప్షన్స్‌లో మార్పులు చేర్పులు, 13వ తేదీ అలాట్‌మెంట్స్, 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా నాలుగో రోజైన గురువారం 43,001 నుంచి 59 వేల ర్యాంకులోపు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 185 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించినట్టు తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం 59,001 నుంచి 75 వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్టు కోఆర్డినేటర్ పేర్కొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



పాకాల : చిత్తూరు– పాకాల మార్గంలో ఊట్లవారిపల్లె వద్ద బుధవారం రాత్రి రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టాలు దాటుతుండా ప్రమాదం జరిగి ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు డ్రాయర్, టీషర్ట్ ఉందని వెల్లడించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు స్థానిక రైల్వేస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పడవ బోల్తా.. బాలుడి మృతి



మునేంద్ర (ఫైల్)

కేవీబీపురం : మండలంలోని బ్రాహ్మణపల్లెకు చెందిన ఓ బాలుడు గురువారం పడవ బోల్తా పడడంతో మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన పిడుగు దయాకర్ కుమారుడు మునేంద్ర(9) తన ఇద్దరు స్నేహితులతో కలిసి చేపలు పట్టే పడవలో చెరువులో విహరించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పడవ బోల్తా పడడడంతో అందరూ చెరువులో పడిపోయారు. ఈత వచ్చిన ఇద్దరు మిత్రులు ఒడ్డుకు చేరగా, మునేంద్ర నీటిలో మునిగిపోయాడు. ఈ విషయాన్ని గ్రామంలోకి వెళ్లి మునేంద్ర స్నేహితులు తెలియజేశారు. గ్రామస్తులు హుటాహుటిన చెరువు దగ్గరకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పూతలపట్టులోని అంబేడ్కర్ రెసిడెన్షియన్ పాఠశాలలో ఐదోతరగతికి అడ్మిషన్ పొందాడని, త్వరలోనే స్కూల్లో చేర్పాలనుకున్నామని, ఇంతలో ఇలా జరిగిపోయిందని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పద్మ

ఏర్పేడు : మండలంలోని పరమాలపల్లెలో గురువారం ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. వివరాలు.. గ్రామానికి చెందిన బొనగ పద్మ ఉపాధి పనికి వెళ్లింది. అయితే ఆమె పనిచేసేందుకు అదే గ్రామానికి చెందిన పలువురు కూలీలు అంగీకరించలేదు. ఆమె పనిచేస్తే తాము వెళ్లిపోతామని స్పష్టం చేశారు. దీంతో మనస్తాపం చెందిన పద్మ ఇంటికి వచ్చి నిద్రమాత్రలు మింగేసింది. కుటుంబీకులు వెంటనే శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





శ్రీవారి ఆలయం వెలుపల ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి





పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణ, తెలంగాణ ఎమ్మెల్సీ మధు

తిరుమల : తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. కుర్తాళం సిద్ధేశ్వర పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తిపీఠం స్వామి రమ్యానంద భారతి స్వామి, ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి, పుదుచ్చేరి మంత్రి లక్ష్మీనారాయణ, కేంద్ర మాజీ మంత్రి పసిపాటి కేపీ, తెలంగాణ ఎమ్మెల్సీ టి.మధు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లయిడ్ న్యూట్రీషియన్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆర్.రమణప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ ఇనిస్టిట్యూట్‌లో బీఎస్సీ, క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్, పెటిసరీ, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సరీవస్ వంటి కోర్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడేళ్ల బీఎస్సీ హెచ్ అండ్ హెచ్ఏ కోర్సుకు ఇంటర్‌లో 50 శాతం మార్కులు, ఆ పైన సాధించిన వారు, క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సు, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జూన్ 21వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలకు పంపాలని సూచించారు. వివరాలకు 9701343846, 9100558006 లో సంప్రదించాలన్నారు. కళాశాల అడ్మిషన్ ఇన్‌చార్జ్ కె.శివరామకృష్ణ, అడ్మిషన్ ఆఫీసర్ ఎస్.భార్గవి, ఫుడ్ ప్రొడక్షన్ ఫ్యాకల్టీ ఎన్.శివరామకృష్ణ చౌదరి, ఫ్రంట్ ఆఫీస్ ప్యాకల్టీ వై.సునీత పాల్గొన్నారు.

ఆర్డీఎస్ఎస్ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ(ఆర్‌డీఎస్ఎస్) పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. ఆయన గురువారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద ఫీడర్లను వేరుచేయడం, అధిక లోడ్ ఫీడర్లను తగ్గించేందుకు అదనపు లైన్లను ఏర్పాటు చేయడం, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మీనరసయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఫైనాన్స్ కన్సల్టెంట్ వీఎస్ బాబు, చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, అయూబ్‌ఖాన్, చలపతి, వరకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన చంద్రమౌళిరెడ్డి తదితరులు

చంద్రగిరి : టీడీపీ రౌడీల దాడులు చంద్రగిరిలో రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అడ్డొచ్చిన వారిని చితకబాదుతూ, చంపేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాజాగా తన దుకాణం వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ మూక దాడి చేసింది. వివరాలు.. తొండవాడకు చెందిన కుమార్ ఆచారి వైఎస్సార్‌సీపీలో చురుకైన కార్యకర్త. కొత్తగుడి వద్ద ఓ ద్విచక్ర వాహనం మెకానిక్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని కుమార్ ఆచారి దుకాణం వద్దే ఉన్నాడు. అతడి దగ్గర పనిచేస్తున్న జహీర్ ఫోన్‌ను దుకాణంలో మర్చిపోవడంతో తీసుకునేందుకు మళ్లీ వచ్చాడు. ఈ క్రమంలో చంద్రగిరికి చెందిన టీడీపీ కార్యకర్త అలీ, మరికొంత మంది యువకులు దుకాణం వద్దకు వచ్చి జహీర్‌పై దాడికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న కుమార్ ఆచారితో పాటు స్థానికులు వారి దాడిని అడ్డుకున్నారు. అక్కడ నుంచి వెళ్లిపోయిన అలీ వెంటనే అఫ్రిదీ, గఫూర్‌లతో పాటు మరికొందరిని తీసుకుని మళ్లీ వచ్చాడు. కుమార్ ఆచారిపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. పరుష పదజాలంతో దూషిస్తూ, కాళ్లు, చేతులతో పిడిగుద్దులు గుద్దారు. ప్రాణభయంతో కుమార్ ఆచారి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు అక్కడకి చేరుకోవడంతో పచ్చచ మూక అక్కడ నుంచి పరుగులు తీసింది. నిన్ను చంపకుండా వదలమంటూ వారు బెదిరింపులకు పాల్పడినట్లు కుమార్ ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న నరసింగాపురం సింగిల్ విండో చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి అక్కడు వచ్చారు. కుమార్ ఆచారిని పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.